# అభిసారిక

శ్రీమతి ఎ. పేరిం కుమారిగారు

అది శ్రావణబహుళ అమావాస్య. ఆకాశ మంతా మేఘావృతమయింది. కన్ను చించుకొన్నా కనుపించని కారు చీకటి లోకాన్నంతా కప్పింది. వాయువు ప్రచండగతిని వీచడం ప్రారంభించింది. మధురానగరి దీపికలన్నీ వాయుదేవుని పాదాక్రాంతులవుతున్నాయ్.... ప్రకృతే గర్జిస్తే ఆఘాటికి ఓర్వగల శక్తి మానవునకే లేదేమో!...

కోటగోడ నీడలో చలిచే ఒణకే దేహాన్ని ముడుచుకొని నిద్రిస్తున్నాడు ఉపగుప్తుడు. అతడొక పరివ్రాజకుడు. దేశ ద్రిమ్మరి.

హఠాత్తుగా ఏదో పాదం అతని శిరస్సుకు తగిలింది. అందెల ధ్వని చెవినద్ద ప్రతిధ్వనిస్తోంది. ఉల్కిపడి లేచి చూచాడు ఉపగుప్తుడు.

తేజోవంతమైన ఆయన నేత్రాలు ఎదుటనున్న వాసవదత్తపై పడ్డాయ్. వాసవి మధురానగరిలో ప్రఖ్యాత నర్తకి. నిండు యవ్వనంతో తొణికిసలాడే ఆమె శరీర లావణ్యం దేహాన్ని కప్పిన పాము కుబుసములాంటి చీనాంబరం లోంచి తొంగి చూస్తోంది. తీర్చి దిద్దిన తిలకం ఆమె వదనారవిందానికి వింతకాంతి నిచ్చింది. మదనోత్తేజకమైన చూపుల బరపుతూ నానా విధాభరణాలంకృతయై ప్రియుని కలసికొనడానికై పోతూంది. ఆ తరుణి పరివ్రాజకుని సుందర వదనంలో పారలౌకిక శాంతి కాంతులను గాంచింది. ముందునకు వంగి అతని హస్తాన్ని తన చేతితో స్పృశిస్తు "క్షమించండి! చీకటిలో నా కాలు మీ శిరోభాగానికి తగిలింది. మీకీ కటిక గాతిపై నిదుర తగదు. మా గృహానికేతెంచి సుఖ తల్పం మీద శయనించి నా గృహం పావనం చెయ్యండి" అంది లజ్జాపూరితవదనయై.

పరివ్రాజకుడు చిరునవ్వు నవ్వి "సుందరీ! నీ ఆహ్వానానికి కృతజ్ఞుడను. కాని తగిన సమయ మింకా ఆసన్నంకాలేదు. సమయము రాగానే తప్పకుండా వస్తాను. నీ దారిని పోయి పని చూచుకో" అన్నాడు.

ప్రకృతి ఘీంకరించింది. మెఱుపు తీవెల సాయంతో వాసవదత్త నిజప్రియ సందర్శనానికై చనుదెంచింది.

* * *

సంవత్సరం అయింది, వసంత సంధ్యాకాలం. నగరంలోని నగారాలు ప్రతిధ్వనిస్తున్నాయ్! కోకిల కూహూ కూహూ నాదాలు, నెమళ్ళ నాట్యాలు ఋతురాజుకు శోభను తెస్తున్నాయ్. ఆనాడు నగర వాసులందరూ పుష్పోత్సవానికని ఆ రామసీమలకు వెళ్ళారు ఊరి వెలుపలకు. తూర్పున చంద్రోదయం ప్రారంభించింది. పశ్చిమాన్ని వివిధవర్ణాలతో మనోహరంగా సూర్యాస్తమయం. మందమలయ మారుతాలు పూల

రవీంద్రుని అనుసరించి

తోటలనుండి రాజమందిరాలలో ప్రవేసిస్తున్నాయ్!

సన్యాసి ఉపగుప్తుడు నగర బాహ్యానికి వెళ్ళాడు. అది భగవన్నియుక్త సంకేత రాత్రి కాబోలు!

అది మాలపల్లె. ఇండ్లు కొద్దిగా ఉన్నాయ్ చుట్టూ మురికి కాలవల కందకాలతో ఓపాడు గృహంలో ఒక చాపమీద వాసవదత్త పడి ఉంది. శరీర లావణ్యం నశించి రోగ భూయిష్ట దుర్గంధ భరితమయింది. బంధుగులు, ప్రియులు ధన సౌందర్యాల వెనక వెంబండిచారు. వాడిన పువ్వును పూజించే మూర్ఖుడెవరూ!

ఉపగుప్తుడు దగ్గరగావెళ్ళి ఆమె శిరస్సును తన తొడపైకి తీసికొని ఉద్ధరిణితో జారీలోని నీరు పోసాడు. అతని నయనాల్లోని కారుణ్య రేఖలు ఆమె వదనం మీద ప్రతిబింబిస్తున్నాయి. మహాత్ముల స్పర్శవల్లే పాపాలు పటాపంచలవుతాయ్. ఆమెకు శాంతి లభించింది. మెల్లగా కన్నులు విప్పి మూల్గుతూనే " నా బాధలనుండి రక్షించిన ఈ ఉదారహృదయులెవరూ? నేనంత నోచుకొన్నానా! "

సహజ స్నేహపూరిత స్వరంతో " నేనూ పరివ్రాజకుడను, వాసవదత్తా! సమయమరుదెంచిందని ఏతెంచాను." అన్నాడు ఉపగుప్తుడు.

ఆమె కనులు బాష్పపూరితాలయ్యాయి. కోయిల పంచమ స్వరంతో ఆలాపిస్తోంది ప్రకృతి గీతాల్ని.

★

# సంక్రాంతి లక్ష్మి



హేమంత ఋతురాజు హేలాగతిఁ జూచి
జనులెల్ల చలితోడఁ సందడింప
తూర్పు కెంజాయ సొంపులు దిద్ది తీర్చుచు
పద్మబాంధవుఁ డదే బయలు దేర
బాలిక లెల్లెడ ప్రాంగణంబుల రంగ
వల్లుల, గొబ్బి పూజల నొనర్ప
క్రొత్త యల్లుండ్రను గొనివచ్చు వేడుక
నత్తవారిండ్ల సందడి వహింప
దేవళంబుల మేళముల్ తేజరిల్ల
పంటలతో పచ్చగానిండి భారతీయ
లక్ష్మివై వచ్చితమ్మ! సంక్రాంతి లక్ష్మి
మంగళములమ్మ! నీకు మా వందనములు.

—శ్రీ భాషాప్రవీణ అయ్యగారి రాఘవమ్మగారు